క్లుప్తంగా

అన్నివర్గాలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



మైనార్టీలకు దుస్తులు అందజేస్తున్న చైర్మన్

జగిత్యాల: అన్నివర్గాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం రంజాన్‌ను పురస్కరించుకుని దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్నివర్గాల ప్రజలను సమానంగా చూస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సహకారంతో మున్సిపల్‌ను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బొద్ల జగదీశ్, కూతురు రాజేశ్ పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్

జగిత్యాల: పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పునీత్ సాగర్ కార్యక్రమంలో భాగంగా చింతకుంట తదితర పరిసరాలలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తీసి శుభ్రం చేశారు. 9టీ తెలంగాణ బెటాలియన్ వారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలతో అంతా కలుషితం అవుతుందని, ప్రతి ఒక్కరూ దీన్ని నివారించవచ్చన్నారు. ఎన్‌సీసీ కేర్ టేకర్ ఎలిజబెత్‌రాణి, కేడెట్స్ మధు, విజయ్, విజయలక్ష్మి, సాయి తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్ కరపత్రం ఆవిష్కరణ




కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రవీణ్‌కుమార్

కోరుట్ల: పట్టణంలోని అయిలాపూర్ రోడ్‌లో గల తైక్వాండో శిక్షణా సంస్థ, కోరుట్ల తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మర్ క్యాంప్ కరపత్రాన్ని పీఆర్‌బీఎం కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్, రైజింగ్ స్కూల్ కరస్పాండెంట్ కుడేల రాజేంద్రప్రసాద్ మంగళవారం కరతప్రం ఆవిష్కరించారు. వేసవిలో నెలరోజుల పాటు పిల్లలకు, పెద్దలకు కూడా ఉచితంగా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇల్లుటపు నర్సయ్య, కల్లెడ విజయ్, కొక్కుల రాజేశ్, మీర్జా అలీ, సాజిద్ అలీ, ముజబుర్ రహమాన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

మల్లాపూర్: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం మల్లాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పనులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎంపీవో జగదీష్, ఈజీఎస్ ఏపీవో సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గానికి సన్మానం



సన్మానిస్తున్న న్యాయవాదులు

కోరుట్ల: నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని న్యాయవాదులు మంగళవారం ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు బద్ది నర్సయ్య, ఉపాధ్యక్షుడు కొంపల్లి సురేశ్, ప్రధాన కార్యదర్శి బైరి విజయ్‌కుమార్, కోశాధికారి చిలివేరి రాజశేఖర్‌తో పాటు కార్యవర్గాన్ని సన్మానించారు. సీనియర్ న్యాయవాదులు గంగుల సత్యార్థప్రకాశ్, తోకల రమేశ్, గంగుల రాంగోపాల్ పాల్గొన్నారు.

వేసవిలో పిల్లలను పర్యవేక్షించాలి

సారంగాపూర్: వేసవి సెలవుల్లో పిల్లలను తల్లితండ్రులు నిరంతరం పర్యవేక్షించాలని పెంబట్ల సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, ధర్మపురి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని పెంబట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లితండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

‘మండల పరిషత్’లో వసతులేవీ?

- రూ.1.15కోట్లు కేటాయించినా.. సౌకర్యాలు అంతంతే
- సమావేశాల నిర్వహణకు తప్పని తిప్పలు
- రూ.35లక్షల నిధులు అదనంగా కేటాయించాలి: అధికారులు



మండల పరిషత్ కార్యాలయం భవనంలో మొదటి అంతస్తులో అసంపూర్తిగా నిర్మాణం

కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయం ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న భవనంలో నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న భవనంలో విధులు నిర్వహించడం కష్టంగా మారిందని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో 2016లో రూ.కోటి మంజూరయ్యాయి. అప్పట్లోనే పనులు ప్రారంభించారు. ఆ నిధులు సరిపోవని స్థానిక అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా అదనంగా రూ.15 లక్షలు మంజూరయ్యాయి. అయినప్పటికీ అరకొర గదులతోనే భవనం పనులు పూర్తి చేశారు. 2019లో కొత్త మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. కొత్త భవనంలో అధికారులకు, సిబ్బందికి సరిపడేలా వసతులు లేకపోవడంతో నాలుగేళ్లుగా ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రభుత్వం మరిన్ని నిధులు మంజూరు చేసి పూర్తిస్థాయిలో గదులు, వసతులు కల్పించాలని ఎంపీటీసీలు, మండల ప్రజలు కోరుతున్నారు.

వసతులు కరువు..

మండల పరిషత్ కార్యాలయానికి మొదటగా రూ.కోటి మంజూరయ్యాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే గదుల నిర్మాణం పూర్తిచేశారు. మొదటి అంతస్తులో స్లాబ్, రెండో అంతస్తులో స్లాబ్ నిర్మించి నిధులు సరిపోవని అసంపూర్తిగా వదిలేశారు. గెస్ట్‌హౌజ్ కోసం అదనంగా రూ.15లక్షలు మంజూరు కావడంతో రెండో అంతస్తులో గెస్ట్‌హౌజ్ నిర్మించారు. మొదటి అంతస్తును అసంపూర్తిగా వదిలేశారు. మరో రూ.35లక్షలు మంజూరైతే పనులు పూర్తవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. వారానికోసారి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం, మూడు నెలలకోసారి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి మొదటి అంతస్తులో తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయినప్పటికీ వసతులు లేపోవడంతో సమావేశం సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంపీటీసీలు, సర్పంచులు వాపోతున్నారు. అభివృద్ధి పనులు పర్యవేక్షించే ఇంజనీరింగ్ అధికారులకు గదులు లేకపోవడంతో వివిధ పనుల కోసం వచ్చిన ప్రజాప్రతినిధులు, ప్రజలు ఫోన్‌లో సంప్రదించి ఏదో ఒక గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశం గది, అధికారులకు, సిబ్బందికి కార్యాలయం నిర్వహణకు గదులు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

రూ.35 లక్షలతో ప్రతిపాదనలు



కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయం భవనం కోసం అప్పట్లో రూ.1.15కోట్లు మంజూరు కావడంతో ఆ నిధులతో పనులు చేయించాం. భవనం పూర్తి చేయడానికి రూ.35 లక్షలతో ప్రతిపాదనలు తయారుచేసి రెండేళ్ల క్రితం ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే పూర్తిస్థాయిలో పనులు చేయిస్తాం.

– ఆదిత్య, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ, కథలాపూర్

పాలకులు దృష్టిసారించాలి



మండల పరిషత్ కార్యాలయంలో అరకొర వసతులుండటం సరికాదు. వివిధ పనులకు అధికారుల కోసం ప్రజలు గ్రామాల నుంచి మండల పరిషత్‌కు వస్తే వారికి మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుంది. అధికారులకే సరిపడేలా గదులు లేని పరిస్థితుల్లో నాలుగేళ్లుగా నెట్టుకురావడం దారుణం. మండల పాలనలో కీలకమైన మండల పరిషత్ కార్యాలయం భవనం నిర్మాణం పూర్తి చేయడంపై ప్రభుత్వం, పాలకులు దృష్టిసారించాలి.

– శ్రీరాముల ప్రకాశ్, మాజీ ఎంపీటీసీ, అంబారిపేట

హాల్ లేకపోవడం బాధాకరం



మండల పరిషత్ కార్యాలయానికి 19 గ్రామాల ప్రజలు వస్తుంటారు. మండల పరిషత్ పరిధిలో ఉండే అన్నిశాఖల అధికారులకు, సిబ్బందికి ప్రత్యేకంగా గదులు నిర్మించాలి. సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి హాల్ లేకపోవడం బాధాకరం. అసంపూర్తిగా ఉన్న మొదటి అంతస్తులో సమావేశం నిర్వహించడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమి చర్చిస్తున్నారో కూడా వినబడని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పూర్తిస్థాయిలో నిర్మించాలి.

– పులి శిరీష, ఎంపీటీసీ, పోతారం

బీజేపీ కార్యకర్త కుటుంబానికి రూ.లక్ష సాయం



చెక్కు అందజేస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త జక్కుల రవి ఇటీవల మృతిచెందాడు. కాగా మంగళవారం నిజామాబాద్‌లో ఎంపీ ధర్మపురి అర్వింద్ రూ.లక్ష ఆర్థిక సాయాన్ని రవి కుటుంబ సభ్యులకు అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, ఎంపీటీసీ ఆకుల మహేశ్, నాయకులు కోల శంకర్, చిలువేరి నాగరాజు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం మండలంలో 14 కొనుగోలు కేంద్రాలు



దీపిక

ఇబ్రహీంపట్నం: యాసంగిలో రైతులు పండిచిన వరిధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి దీపిక తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె మండలకేంద్రంలో మాట్లాడారు. ఇబ్రహీంపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం, వర్షకొండ, ఎర్దండి, మూలరాంపూర్, అమ్మక్కపేట, తిమ్మాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో తిమ్మాపూర్, గొధూర్, యామపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో యామపూర్, వేములకుర్తి, కొజన్‌కొత్తూర్, కేశాపూర్ గ్రామాల్లో కొనుగోలు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో యామపూర్, ఫకీర్‌కొండాపూర్‌లో, డీసీఎంఎస్ ద్వారా డబ్బా గ్రామంలో వరిధాన్యం కొనుగోళ్లు చేపడుతారని వివరించారు. త్వరలోనే ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చేతుల మీదుగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్

మేడిపెల్లి: భీమారం మండలంలోని దేశాయిపేట్, లింగంపేట్, కమ్మరిపేట్ గ్రామాల్లో మంగళవారం ఐకేపీ సెర్ప్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు ప్రారంభించారు.

సంక్షిప్త వార్తలు

✦ పెంబట్లలో ఉద్రిక్తత

సారంగాపూర్: మండలంలోని పెంబట్లలో మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. ఇరు మతాల మధ్య మతపరమైన కార్యక్రమం విషయంలో ఏర్పడ్డ వివాదంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెంబట్లలో పెట్రోల్ పంపు సమీపంలో ఓ మతానికి చెందిన కొంత మంది ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి మత బోధనలు చేస్తున్నారు. కాగా దీనిపై మరో మతానికి చెందిన వారు అడ్డుకున్నారు. మతబోధన చేసిన వారిలో ఒక్కరు కూడా స్థానికులు లేకపోవడంతో పాటు అనుమతి లేకుండా కార్యక్రమం నిర్వహిస్తున్నారని పెంబట్లకు చెందిన పలువురు యువకులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఎస్సై మనోహర్‌రావు ఆధ్వర్యంలో అక్కడికి చేరుకుని పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

✦ నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పర్యటించనున్నట్లు ఐకేపీ ఏపీఎం రాజేశ్ తెలిపారు. ఎమ్మెల్యే పర్యటనలో మండలస్థాయి ప్రజాప్రతినిధులతో పాటు సర్పంచ్, ఎంపీటీసీ, సహకార సంఘాల చైర్మన్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, సెర్ప్ అధికారులు, వీవోఏలు హాజరుకావాలని సూచించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు చిట్టాపూర్‌లో సెర్ప్(ఐకేపీ) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

✦ పారిశుద్ధ్య కార్మికులకు పాదరక్షలు

రాయికల్: ఆదివాసీ దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కుర్సెంగ వేణు జన్మదినం సందర్భంగా మంగళవారం రాయికల్ మున్సిపల్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పాదరక్షలు పంపిణీ చేశారు. కమిషనర్ సంతోష్‌కుమార్, ఆదివాసీ దళిత హక్కుల పోరాట సమితి కోశాధికారి కుర్సెంగ ప్రసన్నకుమార్, కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, కన్నక మహేందర్ పాల్గొన్నారు.

✦ పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామాల్లో ప్రధాన కూడళ్లలోని గోడలపై పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు వాల్ రైటింగ్ చేయించాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎస్బీఎం జిల్లా కోఆర్డినేటర్ చిరంజీవి, ఎంపీవో కృపాకర్ పాల్గొన్నారు.

✦ రంగపేటలో ఒకరిపై దాడి

సారంగాపూర్: మండలంలోని రంగపేట గ్రామంలో మంగళవారం ఓ వ్యక్తిపై దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మనోహర్‌రావు వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పురుమల్ల కొమురయ్యను అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి.. కొమురయ్య ఇంటికి వచ్చి దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

✦ గల్ఫ్ బాధిత కుటుంబానికి చేయూత

మేడిపెల్లి: భీమారం మండలం ఈదుల లింగంపేట్ గ్రామానికి చెందిన చింతకింది సతీశ్ ఇటీవల దుబాయిలో మరణించగా మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ గోలి మోహన్ వారి కుటుంబానికి రూ.10వేల చెక్కు అందజేశారు. ఉపసర్పంచ్ గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమురయ్య, గంగారెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి చేయూత



చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని ఫొటోగ్రాఫర్ అంగడి నర్సయ్య ఇటీవల మృతిచెందాడు. కాగా మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఫొటో, వీడియో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లీనరీ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా అంగడి నర్సయ్య కుటుంబ సభ్యులకు రూ.1.45 లక్షల చెక్కు అందజేసినట్లు ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు రాపర్తి రవి, ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్, కోశాధికారి రవి, మండల ప్రధాన కార్యదర్శి తాటిపాముల రవి, కోశాధికారి ఆడెపు సురేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎలిగేటి సతీశ్ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ డీఈకి సన్మానం



సన్మానిస్తున్న లింగంపేట రైతులు

జగిత్యాలరూరల్: జగిత్యాల విద్యుత్‌శాఖలో డీఈగా బాధ్యతలు స్వీకరించిన గంగారాంను పట్టణ శివారులోని లింగంపేట గ్రామానికి చెందిన రైతులు మంగళవారం సన్మానించారు. లింగంపేటకు చెందిన గంగారాం విద్యుత్‌శాఖ డీఈగా బాధ్యతలు స్వీకరించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతులు రాజిరెడ్డి, సురేశ్, రాజన్న, లచ్చన్న, వెంకట్, నరేశ్, అంజన్న, గంగారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అన్నపూజ

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస శివారులోని సహస్ర లింగాల దేవాలయంలో మంగళవారం ఘనంగా అన్నపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు తీగుళ్ల విష్ణుశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గంగాధర్, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం



ప్రార్థన చేస్తున్న సంజయ్‌కుమార్

మల్లాపూర్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎంపీపీ కాటిపెల్లి సరోజనతో కలిసి ఆయన పాల్గొన్నారు. తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీష్, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు ఏలేటి మహేశ్‌రెడ్డి, సర్పంచ్‌లు బద్దం సరిత, సయ్యద్ హైదర్, మైదాసు శ్రీనివాస్, పాలెపు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

కొడిమ్యాల: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని అప్పారావుపేట, రామకిష్టాపూర్, చెప్యాల, తిప్పాయిపల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఎంపీపీ మేనేని స్వర్ణలత, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్‌విండో చైర్మన్లు మేనేని రాజనరసింగారావు, పోలు రాజేందర్, మల్యాల ఏఎంసీ చైర్మన్ కోరండ్ల నరేందర్‌రెడ్డి, సర్పంచులు ఉట్కూరి రాజశేఖర్‌రెడ్డి, గరిగంటి మల్లేశం మ్యాకల లత, లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ పర్లపెల్లి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు ఉట్కూరి మల్లారెడ్డి, చీకట్ల సింధుజ, సెర్ప్ ఏపీఎం దేవరాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్ పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్

మల్యాల: రైతుల కోసం రైతుబీమా, రైతుబంధు అందజేస్తూ రైతు పక్షపాతిగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కొనియాడారు. ఈ మేరకు మంగళవారం మండలంలో ప్రాథమిక సహకార సంఘాలు, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గొల్లపల్లె, మద్దుట్ల, రామన్నపేట, నూకపల్లి, మల్యాల అడ్డరోడ్డు వద్ద, ముత్యంపేటలో కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కోరండ్ల నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు ముత్యాల రాంలింగారెడ్డి, బోయినపల్లి మధుసూదన్‌రావు, అయిల్నేని సాగర్‌రావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, పాల్గొన్నారు.

రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయండి



ర్యాలీలో పాల్గొన్న ఆది శ్రీనివాస్

మేడిపెల్లి: పెండింగ్‌లో ఉన్న మోత్కురావుపేట్, చందుర్తి రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దీనిలో భాగంగా మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో భీమారం మండల కేంద్రం నుంచి చందుర్తి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక అధికార పార్టీ నాయకుల అసమర్థతతో ఆరేళ్లు గడుస్తున్నా రోడ్డు పనులు పూర్తికాలేదని ఆరోపించారు. వెంటనే పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, కాయితి నాగరాజు, లచ్చనాయక్, కొమురయ్య, జీవన్‌రెడ్డి, నరేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మెట్‌పల్లి: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ చెట్లపల్లి మీనా, మాజీ కోఆప్షన్ సభ్యులు సుఖేందర్‌గౌడ్ కోరారు. స్థానిక వాసవీ గార్డెన్‌లో మంగళవారం కంటివెలుగు శిబిరాన్ని నిర్వహించారు. అనిల్, ప్రదీప్, శ్రీనివాస్, రాంచందర్, శ్రీహరి పాల్గొన్నారు.

శిబిరం ప్రారంభం

మల్లాపూర్: మండలంలోని కుస్తాపూర్‌లో కంటివెలుగు శిబిరాన్ని తహసీల్దార్ రవీందర్, సర్పంచ్ సరికెల లక్ష్మి ప్రారంభించారు. ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీష్, పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ వాహిని, కార్యదర్శి మురళి, కంటివెలుగు ప్రత్యేక వైద్యాధికారులు డాక్టర్ నాగార్జున, హెల్త్ సూపర్‌వైజర్లు ఇందిర, శ్రీనివాస్, నాయకులు సరికెల మహిపాల్ పాల్గొన్నారు.

పెగడపల్లి మండలంలో..

పెగడపల్లి: మండలంలోని ఏడుమోటలపల్లి, లింగాపూర్‌లో మంగళవారం కంటివెలుగు శిబిరం ప్రారంభించారు. సర్పంచులు ఇస్లావత్ రవినాయక్, శంకర్, ఎంపీటీసీలు అంజయ్య, శోభ, సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



డ్రైనేజీని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సుజాత

మెట్‌పల్లి: వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యం చూపొద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం ఆమె పర్యటించారు. బాలకృష్ణనగర్‌లో పలు వీధులను పరిశీలించారు. డ్రైనేజీలు లేకపోవడంతో మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తోందని స్థానికులు తెలిపారు. తొందర్లోనే సమస్య పరిష్కరిస్తామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. ఆ తర్వాత నర్సరీని పరిశీలించారు. ఆమె వెంట కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఏఈ అరుణ్ ఉన్నారు.

రంజాన్ కానుకలు పంపిణీ



కానుకలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అంజయ్య

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూరు గ్రామంలో ముస్లింలకు సర్పంచ్ వనతడుపుల అంజయ్య మంగళవారం రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ చిట్నేని లత, ఉపసర్పంచ్ రాకేశ్ పాల్గొన్నారు.

కథలాపూర్ మండలానికి 300కానుకలు..

కథలాపూర్: మండలంలో 300 మందికి రంజాన్ కానుకలు ప్రభుత్వం మంజూరు చేసిందని తహసీల్దార్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఆయా గ్రామాల ప్రతినిధుల సమాచారం మేరకు 300 రంజాన్ కానుకలు వచ్చాయన్నారు. రెండురోజుల్లో వాటిని ముస్లింలకు పంపిణీ చేస్తామన్నారు.

కొనుగోలు కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఏపీఎం నరహరి

కథలాపూర్: మండలంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఏపీఎం నరహరి సూచించారు. ఈ మేరకు మంగళవారం మండలకేంద్రంలో స్త్రీశక్తి భవన్‌లో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మండలంలో 11 గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సీసీ విజయనిర్మల, ఎంఎస్‌ఏ శాంత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంగన్‌వాడీ వార్షికోత్సవం

ధర్మపురి: ధర్మపురిలోని న్యూహరిజన వాడ 4వ అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ మాధవీలత ఆధ్వర్యంలో ఏడాదిలో పిల్లలకు నేర్పించిన పోషణ, విద్యా కార్యక్రమాలు, ఆహారపు అలవాట్లు, క్రమశిక్షణ తదితర వాటిపై వివరించారు. సూపర్‌వైజర్ కుసుమ, పాఠశాల టీచర్లు కాశెట్టి మహేశ్, రమాదేవి, పిల్లల తల్లులు పాల్గొన్నారు.